క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా ప రిషత్ పాఠశాలలో శనివారం నవోదయ ప రీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రంలో వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన 80 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండ గా 72 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహ ణకు చీఫ్ సూపరింటెండెంట్‌గా జీవీవీ సత్య నారాయణ, సీఎల్‌ఓలు కిరణ్, బీ ఎల్‌ఓగా ఎం ఈఓ వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

రక్తదానం మహాదానం



ఏటూరునాగారం: అన్ని దానాల్లో కన్న రక్త దానం గొప్పదని కన్నాయిగూడెం ఎస్సై సురేష్ తెలిపారు. మండలంలోని షాపెల్లి గ్రామానికి చెందిన లలిత అనే గొత్తికోయ కుటుంబానికి చెందిన గర్భిణీకి అరుదుగా దొరికే ఏబీ పాజిటివ్ రక్తం అవసరం ఉందని ఏటూరు నాగారం బ్లడ్ డోనర్స్ గ్రూప్‌లో చూసి ఎస్సై వెంటనే స్పందించి ఏటూరునాగారం చేరుకొని రక్తదానం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లా డుతూ ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ నిర్వాహ కులు రక్తదానాలు చేస్తూ ఎందరో ప్రాణాలను నిలుపుతున్నారని కొనియాడారు. ఈ మేరకు రక్తదానం చేసిన ఎస్సైను బ్లడ్ డోనర్స్ సభ్యు లు సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ వహీద్, పెండ్యాల ప్రభాకర్, దామెర ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలి



ములుగు రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బీజేపీ సీనియర్ నాయకురాలు గుగులోత్ స్వరూప అన్నారు. శనివారం జిల్లా నూతన అధ్యక్షుడు సిరికొండ బలరాంను ఆమె శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరం భాగస్వామ్యం కావాలని అన్నా రు. కలిసిన వారిలో నాయకులు రవీంద్రాచారి, చల్లూరి మహేందర్, కృష్ణాకర్, కొత్త సురేంద ర్, జనార్దన్, హరీష్, మహేందర్ ఉన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



ఎస్ఎస్‌తాడ్వాయి: ఈనెల 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో మండలంలోని మేడారంలో బీజేపీ నాయకులు శనివారం ఇం టింటికీ అయోధ్య రామయ్య అక్షింతలను పం పిణీ చేశారు. రెడ్డిగూడెంలోని ఆంజనేయస్వా మి ఆలయం నుంచి సర్పంచ్ చిడ్డం బాబు రావుతో కలిసి నాయకులు అక్షింతలను తీసు కుని నేరుగా సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లారు. పూజలు నిర్వహించి అమ్మవార్ల గద్దెల వద్ద అక్షింతలను ఉంచారు. అనంతరం గ్రామా ల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. బీజేపీ నాయ కులు సిద్దబోయిన పాపారావు, జంగా హన్మం తరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు

గోవిందరావుపేట: జనవరి 14 నుంచి ఫిబ్ర వరి 15 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పస్రా ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక ఆటోడ్రైవర్స్, ప్రజలతో రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరికీ తెలిసేలా ర్యాలీ నిర్వ హించామన్నారు. ర్యాలీ అనంతరం ఎస్సై మా ట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశం లో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరు గుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడు తున్నారని తెలిపారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి ట్రాఫిక్ రూల్స్‌ని పాటిం చి ఇతరులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయి అవ గాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమం అన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లీకేజీ సమస్య పట్టించుకోరా ?

- మురుగు నీరు తాగాల్సిందేనా
- స్పందించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మల్లూరు కొత్తబెస్తగూడెం మధ్య పంట పొలాల్లో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి కలుషితమవుతున్న నీరు

మంగపేట: మండలంలో మిషన్ భగీరథ లీకేజీలను పట్టించుకునేది లేదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతోం ది. మండలంలోని కమలాపురం వాటర్‌గ్రిడ్ నుంచి శుద్ధి చేసిన గోదావరి జలాలను మల్లూరు గుట్టపై నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు చేర్చి అక్కడ నుంచి మండలవ్యాప్తంగా ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా గ్రామా ల్లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాకులకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మల్లూరు గుట్టపై నుంచి సర ఫరా అయ్యే మెయిన్ పైప్‌లైన్‌కు మంగపేట, తిమ్మంపేట, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి తదితర గ్రామాల్లో పలుచోట్ల లీకేజీ ఏర్పడి నెలలు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టకుం డా వదిలేశారు. దీంతో లీకేజీ ద్వారా బయటకు వచ్చే నీరు నిలిచి మురుగుగుంటలుగా మారాయి. ఈ నీటిలో పందులు, గేదెలు, కుక్కలు దొర్లుతు న్నాయి. నీటి సరఫరా జరుగుతున్న సమయంలో నీరు లీకేజీ ప్రాంతాల్లో బయటకు వస్తూ నీటి సర ఫరా నిలిచి పోయే దశలో మురుగు నీరు పైప్‌లైన్ లోకి వెళ్తుండటంతో తాగునీరు కలుషితం అవుతోం ది. ఈ నీటిని తాగిన ప్రజలు అంతుచిక్కని వ్యాధుల బారిన పడి ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. మంగపేట నుంచి రాజుపేట వరకు ఏటూరునా గారం–బూర్గంపాడు ప్రధానరోడ్డు వెంట ఎక్కడ చూసినా లీకేజీలతో గోతుల్లో మురుగు నీరు నిలిచిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ తాగునీటి సరఫరా కోసం నియమించిన ఉద్యోగులకు కనిపిం చక పోవడం సంబంధిత ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోక పోవడంపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. తాగునీటి సరఫరా, పైప్‌లైన్ లీకేజీలపై పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి సుమారుగా సంవత్సరం కావస్తున్నా అధికారులు స్పందించక పోవడం గమనార్హం. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి సుమారు 12 గ్రామ పంచాయ తీల పరిధిలోని 20 గ్రామలకు పైగా సరఫరా అవు తున్న పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరతున్నారు.

గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గీతకార్మికుల సమస్యలను ప్రభు త్వం పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య కోరారు. శనివారం మండలంలోని కాటాపూర్‌లోని ఎల్లమ్మ గుడి ఆవర ణలో ముస్తాదర్ గడ్డం శ్రీధర్ అధ్యక్షతన కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను నర్సయ్య గీతకార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం లోని గౌడ కులస్తులను ఎస్టీ జాబితాలో కలపాలని డిమాండ్ చేశారు. గీతకార్మికులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. గీత కార్మికుల భద్రత కోసం యంత్రాలను పంపిణీతో పాటు ద్విచ క్రవాహనాలను ఉచితంగా అందించాలన్నారు. కం ఠమహేశ్వర, మైసమ్మ, ఎల్లమ్మ బోనాల పండుగను మార్చిలో జరుపుకోవాలని నిర్ణయించినట్లు తెలి పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులి పెద్ద నర్సయ్య, జిల్లా నాయకులు బెల్లంకొండ రోశయ్య, పులి రవి, పాలకుర్తి రవీందర్, ప్రదీప్, శంకర్ గీత కార్మికులు బెల్లంకొండ నరేష్, రంగు సత్యం, రాజయ్య, సదయ్య పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో గుడుంబా స్థావరాలపై వెంకటాపురం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడు లు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లం పానకంతో పాటు గుండుంబా తయారు చేసే సామగ్రిని ధ్వంసం చేశారు. గుండుంబా తయారు చేస్తున్న రాము, పుల్లారావు అనే ఇరువురు వ్యక్తు లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ బండారి కుమార్ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైన గుడుంబా తయారు చేసిన విక్రయించిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. గుడుంబా విక్రయించిన, తయారు చేస్తున్నట్లు ఎవ రికైనా తెలిస్తే తక్షణమే పోలీసులు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి రావు, అశోక్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని మల్లయ్యపల్లి, చత్రుప్పలపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసి నట్లు ఎస్సై చల్లా రాజు తెలిపారు. ఆయా గ్రామా ల్లో గుడుంబా పాత్రలను ధ్వంసం చేసి, అక్రమంగా గుడుంబా తయారు చే స్తున్న చత్రుప్పలపల్లికి చెం దిన భూక్యా రా జారాం, మల్లయ్యపల్లికి చెందిన జరుపుల లక్ష్మి పై కేసు నమోదు చేసినట్లు పేర్కొ న్నారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రా మాల్లో అక్రమంగా గడుంబా తయారు చేయడం చ ట్టరీత్యా నేరమని, తయారుదారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: మండలంలో ప్రత్యేక శిబిరం ఓటరు నమోదు కార్యక్రమాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసు కోవాలని తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని 28 ఓటరు నమోదు కేం ద్రాల వద్ద ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపెయిన్ లను ఆయన పరిశీలించారు. 28 కేంద్రాల్లో ఫాం–6 28 వచ్చాయని, ఫాం–8 రెండు వచ్చాయన్నారు. అలాగే 170 ఎమ్మెల్సీ దరఖాస్తులు రాగా వాటిపై విచారణ జరుగుతుందన్నారు. అలాగే నేడు(ఆది వారం) కూడా ఓటరు నమోదు కార్యక్రమం జరుగు తుందని ఆయన వెల్లడించారు. బీఎల్‌ఓలకు వారి ఓటరు కేంద్రాల పరిధిలోని ఓటర్లు ఫాం–6 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. డి ప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెం ట్ భాను,బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఏటూరునాగారం: డిగ్రీ పూర్తి చేసిన ప్రతి పట్టభద్రు లు ఎమ్మెల్సీ ఓటరుగా ఆన్‌లైన్ నమోదు చేసు కోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరి గిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రణాళికను ఉద్దేశించి మాట్లాడారు. ములుగు నియోజకవర్గం ఏటూరు నాగారం మండల వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు ఓటరుగా ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని కో రారు. గతంలో ఓటు వేసినా వారు కూడా మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ , జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి చిన్న ఎల్లయ్య, నరేందర్, నజీర్, మధు, నర్సయ్య పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత.. ముగ్గురిపై కేసు

వాజేడు: మండల పరిధి పెద్ద గంగారం, టేకులగూ డెం, కృష్ణాపురం గ్రామాల్లో శనివారం పేరూరు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఇంటింటా సోదాలు చేశారు. సోదాల్లో కృష్ణాపురానికి చెందిన బలుసుపాటి లక్ష్మయ్య, పెద్ద గంగారం గ్రామానికి చెందిన ఇరుప ప్రణీత్, టేకులగూడెం గ్రామానికి చెందిన కురుసం సన్యాసి వద్ద 60 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న వారిని పట్టుకుని నాటు సారాను సీజ్ చేసి ముగ్గురుపై కేసు నమోదు చేసి నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మరో సారి నాటు సారా విక్రయించకుండా తహసీల్దార్ ఎదుట బైండో వర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి



మాట్లాడుతున్న వట్టం ఉపేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర పనుల్లో కాం ట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తు డుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ డిమాం డ్ చేశారు. శనివారం మేడారంలో జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వట్టం ఉపేందర్ హాజర య్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మక్క–సారలమ్మ జాతరకు వివిధ రాష్ట్రాల నుం చి భక్తులు హాజరవుతారని ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాల న్నారు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లు వెచ్చించి పనుల్ని ప్రారంభించిందని, ఈ పనులన్నీ భక్తులకు ఉపయోగపడేలా చేపట్టాలని డిమాండ్ చేశారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారు లు పర్యవేక్షించాలన్నారు. పనులన్నీ నత్తనడకన కొనసాగుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాసిరకంగా పను లు చేపట్టిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కో–కన్వీనర్ పొడెం రత్నం, రాష్ట్ర కార్యద ర్శి చింత కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మ హేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎట్టి రాజబాబు, కాపుల సమ్మయ్య, పొలం తిరుపతి, జిల్లా సహాయ కార్యద ర్శులు సిద్దబోయిన సర్వేశ్వరరావు, కోట సంపత్, వట్టం సురేశ్, కుచ్చింటి చిరంజీవి, ప్రచార కార్యద ర్శి చింత శ్రావణ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గొంతెమ్మ గుట్ట సందర్శన

కాటారం: చరిత్రాత్మక విశిష్టత కల్గిన కాటారం మం డలంలోని ప్రతాపగిరి సమీపంలో గల గొంతెమ్మ గుట్టను ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పంచాయతీ రాజ్ డీఈఈ సాయిలు, ఏఈఈ అశోక్ శనివారం సందర్శించారు. గొంతెమ్మ గుట్టపై ఆదివాసీ గిరి జనుల ఆరాధ్యదైవాల జాతర త్వరలో జరగనున్న నేపథ్యంలో ఎంపీపీ, అధికారులు గుట్టపై సౌకర్యా లు కల్పన కోసం పరిశీలించారు. భక్తులకు ఇబ్బం దులు కల్గకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాట్లు చేయ నున్నట్లు తెలిసింది. అటవీ ప్రాంతం గుండా రోడ్డు మార్గం, గుట్టపై విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లు చేయ నున్నట్లు సమాచారం.

జాగృతి ఆధ్వర్యంలో షటిల్ క్రీడోత్సవాలు



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రవీందర్

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటలో భారత జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం షటిల్ క్రీడోత్స వాలు నిర్వహించి శనివారం బహుమతులు అందించి నట్లు భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పోరిక రవీం దర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులనుద్దే శించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వ హించడం వల్ల గ్రామీణస్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతాయని పేర్కొ న్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. షటిల్ క్రీడల్లో ప్రథమ బహుమతి పొందిన చిర్ర మహేందర్, దర్శన్ జట్టుకు రూ.5016 నగ దుతో పాటు షీల్డ్, ద్వితీయ బహుమతి పొందిన వినీల్, రాజేందర్‌లకు రూ.3016 నగదుతో పాటు షీల్డ్‌ను బహుకరించారు. కార్యక్రమంలో నిర్వహకులు తిరుపతి, సిద్దూ, రాజు, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి సీతక్కను కలిసిన నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేస్తానని రాష్ట్ర పం చాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని కాల్వపల్లికి చెం దిన బీసీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ యశాడపు మల్లయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దబోయిన శ్రీనివాస్ హనుమకొండలో మంత్రి సీతక్కను కలిసి కాల్వపల్లి గ్రామాల్లోని సమ స్యలను విన్నవించారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తానని మంత్రి సీతక్క నాయకులకు హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన వారిలో రంజిత్, శ్యామల రాజు ఉన్నారు.

భూకబ్జాపై రెవెన్యూ అధికారుల విచారణ



మల్లూరులో సహకార సంఘం స్థలం వద్ద విచారణ చేస్తున్న ఆర్ఐ కుమారస్వామి

మంగపేట: మండలంలోని మల్లూరులోని మంగ పేట రైతు సేవా సహకార సంఘానికి చెందిన ఉమ్మడి స్థలాన్ని కబ్జా చేసిన విషయంపై రెవెన్యూ అధికారులు గ్రామస్తుల సమక్షంలో శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, సీఈఓ జగన్నాథరావు మాట్లా డుతూ మల్లూరులో శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ప్రాథ మిక సహకార పరపతి సంఘం మల్లూరులో నెల కొల్పేందుకు 1983లో గ్రామానికి చెందిన ఆక చిన్నయ్య, ఆక సత్యం నుంచి సర్వేనంబర్ 9 మింజు ముల్లై ఎ 0.13 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసి ములుగు సబ్‌రిస్ట్రార్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించి సం ఘ నిర్వహణ కోసం భవనాన్ని నిర్మించారన్నారు. దీన్ని గ్రామపంచాయతీ రికార్డులో చేర్పించామ న్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థలం సహ కార సంఘం ఆధీనంలోనే ఉందన్నారు. పూర్వం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో 2019, 2020లో భవనాన్ని కూల్చివేయడం జరిగింద న్నారు. ఇదిలా ఉండగా ఈనెల 17న గ్రామానికి చెం దిన ఆక రామకృష్ణ, నరేంద్రబాబు సంఘానికి చెం దిన స్థలాన్ని కబ్జా చేసేందుకు కంచె ఏర్పాటు చేసేం దుకు సిమెంటు స్తంభాలు వేస్తుండగా విషయం తెలుసుకున్న సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌తో కలిసి అడ్డుకున్నామన్నారు. విషయంపై వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ఈనెల 19 విషయంపై జిల్లా కలెక్టర్‌కు నివేదించామన్నారు. కలెక్టర్ దేశాల మేరకు కుమారస్వామి స్థలం వద్దకు వచ్చి విచారణ జరిపి స్థానిక రైతులు, సంఘ సభ్యుల నుంచి విచారించి వారి వాంగ్మూలాన్ని సేకరించారు. స్థానికులు ఇచ్చిన వాంగ్మూలం నివదికను కలెక్టర్‌కు అందచేసి తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో మంగపేట, మల్లూరు, గాంధీనగర్, నర్సింహసాగర్, రాజుపేట తదితర గ్రామాల రైతులు, సంఘాల సభ్యులు, మాజీ ఎఫ్ఎస్‌సీ చైర్మన్ వల్లెపల్లి శివప్రసాద్, డైరె క్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



ఏటూరునాగారం : మాట్లాడుతున్న సీడీపీఓ



మంగపేట : మాట్లాడుతున్న వినోద

ఏటూరునాగారం: బాల్య వివాహాలను అరికట్టాలని ఏటూరునాగారం ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూ రిబా గాంధీ విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ అరు ణ అధ్యక్షతన బాలిక సాధికారత, బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. సమాజంలో అమ్మాయిలు, అబ్బాయిలు లింగ బేధం లేకుండా ఇద్దరిని సమానంగా చూడాల న్నారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలిపారు. చదువుకునే దశ నుంచే బాలికలు లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా ప్రయ త్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, స్థానిక బీట్ ఆఫీసర్ రాజే శ్వరి, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

మంగపేట : బాలకార్మికుల వ్యవస్థను నిర్మూలిం చాలని జిల్లా సహాయ కార్మిక అధికారి వినోద అన్నారు. మండల కేంద్రం పరిధిలోని గంపోనిగూ డెం రైతువేదిక కార్యాలయంలో ఆటో, టాటామ్యా జిక్, డ్రైవర్లు, ఓనర్లు, భవన కార్మికులు, మేస్త్రీలు, వెల్డింగ్ షాపులు, ట్రాక్టర్, బైక్ మెకానిక్ తదితరుల తో బాలకార్మిక చట్టాలు, బాలల హక్కులు, బాలల లైంగిక వేధిపులు, ఈశ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మౌనిక, పంచాయతీ కార్యదర్శి సురేశ్, పలు కార్మిక సంఘాల నాయకులు రమణయ్య, చక్రయ్య, మెకానిక్ సంఘాల నాయకులు, ఆటోడ్రైవర్లు పాల్గొ న్నారు. అలాగే మండలంలోని రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రావుల భా స్కర్‌రావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ, విద్యా ర్థులకు నేటి సమాజంలో లింగవివక్షత, బాల్యవి వాహాలపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో బాల రక్షభారత్ ప్రతినిధి రమేష్, పాఠశాల చైర్మన్ దాసరి రవి, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ హేయం

వాజేడు: బాలకార్మిక వ్యవస్థ హేయమైన చర్య అని ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపేటలో శనివారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక చట్టాలు, బాలలపై లైంగిక దాడులు, బాలల హ క్కులు, దత్తతలపై అవగాహన కల్పించారు. బాల ల్యం అమూల్యమైన దశ అని దానిని పొందేలా చూడాలన్నారు. పిల్లలను దత్తత తీసుకునే వారు చట్టపరంగా తీసుకోవాలని తెలిపారు. సమావేశం లో సుమన్, అయ్యవారిపేట రైతులు పాల్గొన్నారు.

పసి బాలుడి వైద్యానికి చేయూత

సాక్షి ఎఫెక్ట్..



బాబు తల్లిదండ్రులను ఓదార్చుతున్న మహబూబాబాద్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

గోవిందరావుపేట: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసి బా లుడి వైద్యానికి చేయూతను అం దించి దాతృత్వం చాటుకు న్నారు మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్. మండల కేంద్రంలోని చల్వాయి గ్రామానికి చెందిన వెల్పుగొండ నాగరాజు మౌనిక దంపతుల కుమారుడు లక్ష్మణ్ ఆడుకుంటూ కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది, మెదడులో రక్తం గడ్డ కట్టింది. దీంతో ఆపరేషన్ ఖర్చులకు వా రు ఇబ్బంది పడుతుండటంతో 'సాక్షి'లో దాతలు ఆదుకోండి ప్లీజ్ అని ప్రచురించిన శీర్షికకు స్పందిం చిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా పసి బాలుడి వైద్యానికి రూ.10 వేల అందించి మానవత్వాన్ని చాటుకు న్నారు. హనుమకొండలోని ఆస్పత్రికి వెళ్లిన తస్లీమా బాబు తల్లిదండ్రులను ఓదార్చి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడి మంచి వైద్యం అం దించాలని కోరారు. సాక్షిలో ప్రచురితమైన కథనం తో చాలా మంది దాతలు ముందుకు వచ్చి సాయం చేస్తున్నారని 'సాక్షి'కి రుణపడి ఉంటామని తల్లిదం డ్రులు అన్నారు.

సాగునీరు అందించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

వెంకటాపురం(కె): పాలెం ప్రాజెక్టు నుంచి గిరిజన రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ ఆది వాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో మండల పరి దిలోని చిరుతపల్లి గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై మూడు గంటల పాటు రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాడుతూ.. వంద కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన పాలెం ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు రావాల్సిన సాగునీరు గోదావరి పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కెనాల్ అధికారులు మరమ్మతులు చేయక పోవటం సాగునీరు అంద టం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పాలెం ప్రాజెక్టు కాల్వకు మరమ్మతులు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న అధికారులు ఆందోళన చేసిన రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆం దోళన విరమించారు. కార్యక్రమంలో అట్టం సత్యం , బాబు, వెంకటరమణ, నారాయణ, రమేష శివ తదితరులు ఉన్నారు.